19.7.1996 శుక్రవారం 12 పేజీలు సంపుటి:68 సంచిక:29 విడిప్రతి రూ.2.00లు Phone: 27364 Regd. No. HNL 18

# జమీన్‌రైతు

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు జీవనప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

ఇల్లు అమ్మబడును.

నెల్లూరు పెద్ద పోస్టాఫీసు ఎదురు వ్యాపారకేంద్రంలో సుమారు 18 అంకణముల విస్తీర్ణంలో రూ. 3,500/- అద్దెవస్తున్న రెండు అంతస్తుల మిద్దెఇల్లు అమ్మబడును. వివరములకు:

మద్రాసు ఫోన్:516132/నెల్లూరు ఫోన్:23244

### అలమట్టి ద్రోహం నివారించకుంటే నెల్లూరు మెట్ట తాలూకాలకు నీటి స్పర్శ తగలదు!

# తెలుగుగంగగతి దుర్గతే?

అలమట్టి డ్యాం విషయంలో నెల్లూరు జిల్లాకు జరగబోతున్న ఘోర దురన్యాయాన్ని జిల్లా ఎమ్మెల్యేలు, ఇతర రాజకీయ వాదులు పట్టించుకోక పోవడం క్షమార్హం కాని నేరం. ఒక్క యానాది రెడ్డి గారు తప్ప తక్కిన ఎమ్మెల్యే లందరూ తెలుగు పక్షులు కావడంతో ముఖ్య మంత్రికి భయపడి నోరు మెదపు తున్నట్లు లేదు. యానాది రెడ్డి గారికి పదమూడు ముక్కల పఠనం తప్ప జిల్లా గురించి ఎప్పుడూ పట్టదు. జిల్లాలోని కాంగ్రెస్ వాదులైనా ఈ విషయంలో ఏమాత్రం పదిలించుకొని అలజడి ప్రారంభించ కుంటే – నెల్లూరు రైతాంగం ఘోరంగా నష్టపోతుంది.

అలమట్టి డ్యాం వల్ల కేవలం కృష్ణ నది డెల్టాలోని కృష్ణ, గుంటూరు, ప్రకాశం జిల్లాలు మాత్రం నీటి సమస్య ఎదుర్కొంటా యనుకోవడం తప్పు; అంతకంటే అధికంగా కడప, నెల్లూరు, చిత్తూరు జిల్లాలు కరువు కోరల్లో చిక్కుకు పోతాయి. తెలుగు గంగ పథకం యావత్తు నిష్ఫలం అవుతుంది. బచావత్ అవార్డు వివరాలలోకి, తెలుగు గంగ పథకం రూపకల్పన నాటి విషయాల్లోకి వెళ్తే కాని, జరగబోతున్న దారుణ దురన్యాయం అర్థం కాదు.

బచావత్ అవార్డు చేసిన నీటి పంపకంలో (ఆ వివరాలు 2 పేజీలో ఇచ్చాము) తెలుగు గంగ పథకం లేదు. జూరాల, శ్రీశైలం, నాగార్జున సాగర్, ప్రకాశం బ్యారేజి, భీమా ఎత్తిపోతల వంటి పథకాల విషయం మాత్రమే ట్రిబ్యునల్ అవార్డులో ప్రస్తావించారు. తెలుగు గంగకు సంబంధించి – కర్నాటక, ఆంధ్ర, మహారాష్ట్రలు తలా ఐదు టిఎంసిల నీళ్లు మద్రాసు దాహం తీర్చడం కోసం ఇవ్వాలన్న నిర్ణయం మాత్రమే జరిగింది. మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి, స్వర్గీయ ఎన్టీ రామారావులు సాహసించి తీసుకొన్న నిర్ణయాల వల్లనే తెలుగు గంగ ప్రాజెక్టు పురుడు పోసుకున్నది. 1978లో చెన్నారెడ్డి గారు మద్రాసు మంచినీళ్ల పథకం ప్రతిపాదన తెచ్చి, అందులో భాగంగా నెల్లూరు, కడప, చిత్తూరు జిల్లాల బీడు భూములను సస్య శ్యామలం చేయుతల పెట్టారు. ఈ పథకం స్వరూప స్వభావాలు అర్థం చేసుకోలేక ఆనాటి ప్రతిపక్ష నాయకులు సర్దార్ గౌతు లచ్చన్న, స్వర్గీయ పుచ్చలపల్లి సుందరయ్యలు నీళ్లు లేని ప్రాజెక్టు కడుతున్నారని అవహేళన చేసి, అలజడి సృష్టిస్తే – ఆనాటికి రెవిన్యూ మంత్రిగా వుండిన శ్రీ నేదురుమల్లి జనార్దన రెడ్డి; చెన్నారెడ్డి లిద్దరూ వారిని వ్యక్తిగతంగా కలిసి, అంతర్గత వివరాలు వెల్లడించి, అలజడి ఉపశమింప జేశారు. బచావత్ అవార్డు ప్రకారం తెలుగు గంగకు నీటి కేటాయింపు లేకపోయినా వరద నీటిని వినియోగించుకొనే స్వేచ్ఛ ఆంధ్ర ప్రదేశకు వుంది కాబట్టి, ఆ నీటి లభ్యత ప్రకారం [illegible]దారు లక్షల ఎకరాలకు పారుదల సౌకర్యం కల్పించ వచ్చునని; బచావత్ అవార్డు – వరద నీటిని వుద్దేశించి కొత్త ప్రాజెక్టులేవీ నిర్మించ కూడదని, వున్న ప్రాజెక్టు లాధారంగానే వరద నీటిని వాడుకోవాలని స్పష్టంగా నిర్దేశించి నందువల్ల తెలుగు గంగ నీటి వనరులను స్పష్టంగా చూపలేక పోతున్నామని చెన్నారెడ్డి, జనార్దన రెడ్డి లిద్దరూ ఆనాటి ప్రతిపక్ష నాయకులకు నచ్చ చెప్పారు. ఎన్టీ రామారావు గారు ముఖ్య మంత్రిగా వున్నప్పుడు మరొకసారి ఈ వివాదం వస్తే ఆయన మాత్రం పబ్లిక్‌గా వివరాలు చెప్పేశారు.

ప్రభుత్వ లెక్కల్లో తెలుగు గంగ ప్రవాహ పరిమాణం మద్రాసుకు వెళ్లవలసిన నీటి వరకే పరిమితమై వుంటుంది. కాని వాస్తవంలో శ్రీశైలం రిజర్వాయర్ నుంచి కృష్ణ వరద నీరు సమస్తం తెలుగు గంగలోకి పారుతుంది. అందు కోసమే వెలుగోడు, బ్రహ్మంగారి మఠం, కండ్లేరు రిజర్వాయర్‌లు నిర్మిస్తున్నారు. కేవలం మద్రాసుకు నీరు ఇవ్వడం కోసమే అయివుంటే 800 కోట్లు ఖర్చు పెట్టి ఇంత పొడుగు కాలువ, ఇన్ని రిజర్వాయర్‌లు నిర్మించ నవసరం లేదు. ఒక పైప్‌లైన్ వేసి, నీళ్లు పంపేయ [illegible]. ఇదీ తెలుగు గంగ కథ.

> కృష్ణ వరద నీళ్లపై ఆధారపడిన తెలుగు గంగ పథకానికి చుక్క నీరు రావు; సోమశిల రిజర్వాయర్ దండగై పోతుంది; రెండున్నర లక్షల ఎకరాల అదనపు ఆయకట్టు కలలన్నీ కల్లలౌతాయి; నెల్లూరు రైతాంగం తక్షణం మేలుకోవాలి!

ఇప్పుడు అలమట్టి డ్యాం నిర్మాణం వల్ల కర్నాటక ప్రభుత్వం కేవలం ఆంధ్రకు కేటాయించిన 800 టిఎంసిల జలాలను మాత్రమే దిగువకు విడుదల చేస్తుంది. అవి – ఇప్పటికే వున్న ప్రాజెక్టులకు మాత్రమే సరిపోతాయి. తెలుగు గంగకు ఇవ్వడానికి చుక్క నీరు రాదు. తెలుగు గంగ పథకం క్రింద ఆత్మకూరు, వెంకటగిరి, రాపూరు వంటి మెట్ట తాలూకాలలో రెండు లక్షలా 50 వేల ఎకరాలను సస్యశ్యామలం చేసే ఉద్దేశ్యం నీరు గారిపోతుంది. ఈ తాలూకాలు శాశ్వతంగా కరువు తాకిడికి గురౌతాయి. త్రవ్విన కాలువలు, కట్టిన రిజర్వాయర్‌లు వృధా అవుతాయి. కడప జిల్లాలో మరొక రెండున్నర లక్షలు, చిత్తూరు జిల్లాలో పాతిక, ముప్పయి వేల ఎకరాలదీ ఇదే కరువు దుర్గతి.

జిల్లా రైతాంగానికి ఇంత పెద్ద ప్రమాదం ముంచుకొని వస్తుంటే, ఒక్క ఎమ్మెల్యే నోరు మెదపక పోవడం అన్యాయం. ఇద్దరు మంత్రులు, ఎనిమిది మంది అధికార పక్ష ఎమ్మెల్యేలు వుండి దండగా వున్నది. కృష్ణ, గుంటూరు జిల్లాల రైతులు, నాయకులు ఈ విషయంలో ప్రదర్శిస్తున్న ఆందోళన సైతం నెల్లూరు రైతులలో, నాయకులలో వ్యక్తం కావడం లేదు. నిజానికి ఆ జిల్లాల

[illegible] 11 పేజీలో



నెల్లూరు రైల్వే స్టేషన్ సమీపంలో 14వతేది రాత్రి జరిగిన రైలు ప్రమాద విధ్వంసదృశ్యాలు - చెల్లాచెదరైన పెట్టెలు; రైలు కట్ట క్రింద గుడిసెల వద్దకు ఎట్లా ఎగిరి పడ్డాయో చూడండవి! (వార్త 7 పేజీలో)

# కొనబోతే కొరివి వంటి ధరలు- తినబోతే భరించలేని కల్తీ!

*సామాన్యుడు ఆకులు అలములు తిని బ్రతకాల్సి వచ్చేట్టుంది!*

'ఏమీ కొనేటట్టు లేదు... ఏమీ తినేటట్టు లేదు... ధర లిట్లా మండిపోతే బాగులో...బాగుల్లా' అని వాపోయారొక గృహిణి. మార్కెట్లో పెరిగి పోతున్న ధరల తీరు చూస్తే ఆ పెరుగు గుర్తుకు వస్తున్నది. పెరిగే ధరలతో సామాన్య మధ్య తరగతి ప్రజలు జీవించడమే దుర్భరంగా మారిపోయింది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు పదవీ ప్రమాణం చేసిన వెంటనే నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని చెప్పి హోల్‌సేల్ వ్యాపారులతో సమావేశాలు నిర్వహించారు. అక్టోబర్ 1తేది నుంచి ప్రతి ప్రొవిజన్ స్టోరులో కందిపప్పు కేజీ 22, మినపప్పు 18, పెసరపప్పు 16, వేరుశనగపప్పు 36రూపాయలకు అమ్మాలని ఆదేశాలు జారీచేసారు. అప్పటి జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ గిరిధర్ కాసింత కఠినంగా వ్యవహరించడంతో నెల్లూరు టౌన్‌లో ఈ రేట్లకే సరుకులిచ్చారు. గిరిధర్ వున్నంత వరకు ఆయన మెరుపు దాడులకు జడిసిన కిరాణా వర్తకులు ప్రభుత్వరేటు - ప్రైవేటు రేటంటూ రెండు రకాలుగా

> **కందిపప్పు రు.32లు**
> **టమోటాలు రు.16లు**
> **పుచ్చు వంకాయలు**
> **కిలో పదిరూపాయలు-**
> **కొనేదేంది? తినేదేంది?**

వస్తువులు విక్రయించారు. ఆ తరువాత ఎన్నికలు రావడంతో ఆ కట్టుదిట్టాలన్నీ గాలిక కొట్టుక పోయాయి. ధరలు మళ్లీ పెరిగిపోయాయి. ప్రస్తుతం మార్కెట్లో కందిపప్పు కేజీ 32, మినపప్పు 25, పెసరపప్పు 24, వేరుశనగ మాని 38 రూపాయలు పలుకు తున్నాయి. పెరిగే ధరలదొక బాధ అయితే, కల్తీది అంతా పెద్ద బాధ. వేరుశెనగ మానెలో ఏమి కలుపు తున్నారో గాని, ఒక్కొక్కసారి అది అనారోగ్యం పాలు చేసేస్తున్నది. పప్పుల్లో, దినుసుల్లో కూడా కల్తీయే!

సంచినిండా డబ్బుతో వెళిత జేబునిండా కూరగాయలతో తిరిగొచ్చే పరిస్థితి ఏర్పడి వుంది - మార్కెట్‌కు వెళ్తే! రిటైలుగా టమోటాలు కేజీ 16రూపాయలు, క్యారట్ 25, క్యాబేజి 12, వంకాయలు 10, కాకర కాయలు 10, బీన్స్ 12, ఉల్లగడ్డ 10, దామగడ్డ 10, మిరపకాయలు 18, చిక్కుడుకాయలు 8, బీరకాయలు 8 రూపాయల ధర పలుకు తున్నాయి.

కొరవ 11 పేజీలో

# టౌన్ చౌకడిపో డీలర్లను అదరగొట్టేశారు ఆర్డీఓ గారు!

12తేది నుంచి 16తేది వరకు నెల్లూరు టౌన్‌లోని రేషన్ షాపులను డీలర్లు మూసివేసారు. స్టోన్‌హౌస్‌పేట, నవాబుపేట ప్రాంతాల్లోని కొన్ని రేషన్ షాపులపై నెల్లూరు ఆర్డీఓ దాడి చేసి రికార్డులు స్వాధీనం చేసుకోవడాన్ని నిరసిస్తూ, డీలర్లు ఈ పనికి పూనుకొన్నారు. రేషన్ షాపులపై రెవిన్యూశాఖ దాడి చేయడం సహజమే అయినా, ఈ దాడుల వెనుక దాగి మళ్లిన 45టన్నుల రేషన్ బియ్యం కథ దాగుంది. టౌన్‌లో రేషన్ షాపులడీలర్లందరూ ఒక యూనియన్‌గా ఏర్పడి బలపడి పోయారు. ఒకేమాట, ఒకేబాటగా వ్యవహరించడంతో పాటు రెవిన్యూ, పౌరసరఫరాల శాఖలో వుద్యోగులకు అన్ని రకాల అవసరాలు తీరుస్తున్నారు. దీనివల్ల స్టాక్ పాయింట్ లోనే లక్షలాది రూపాయల సరకు

> **నెల్లూరు సంగతులు**

మాయమై పోతున్నా మూడో కంటికి తెలిసే అవకాశమే ఏర్పడడం లేదు. రెవిన్యూ శాఖ వుద్యోగులు కూడా కెపాసిటీ మించి కోటా మంజూరు చేసి డీలర్లను ఆదుకొనేవారు. ఈ విధంగా గత కొన్ని రోజులుగా 45 టన్నుల బియ్యం అదనపు కోటా లెక్కలో నవాబుపేటలోని గోడౌన్ నుంచి నవాబుపేట, స్టోన్‌హౌస్‌పేటల్లోని రేషన్ షాపులకు చేరాయట. అక్కడ నుంచి ప్రైవేట్ గోడౌన్లకు తరలి వెళ్లిపోయాయి. ఈ విషయాన్ని ఎవరో ఆకాశ రామన్న ఉత్తరం ద్వారా ఆర్డీఓకు ఫిర్యాదు చేయడంతో ఆమె తన చతురంగ బలాలతో వెళ్ళి తనిఖీ చేస్తే ఒక ప్రైవేట్ గోడౌన్‌లో రేషన్ బియ్యం దొరికాయి. తీగ

కొరవ 11 పేజీలో

# సణుగుడు

* యానాది బావకు అంత సిగమెక్కిందెందు వల్ల?
* వర్ధమాన సమాజం వ్యర్థరాజకీయాలు

యానాది బావకు వున్నట్టుండి సిగమెక్కి నట్టుంది; ఎగిరెగిరి పడుతున్నారు. మామూలుగానే ఆయనను నెలపొడ కాటు, నటి మీద పెంపి కుదురుగా నిలవవు. బీరపిల్ల వలె వెంగువెంగున గెంతు తుంటారు. ఆవేశం వచ్చినప్పుడు ఇక చెప్పనే పనిలేదు. ఆ ఆవేశం ఎందుకు వస్తుందో, ఎప్పుడు వస్తుందో చెప్పడం కష్టం. మొన్న హైదరాబాదులో జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో అటువంటి పూనకమేదో పట్టినట్లుందాయనకు.

సిఎల్పి సమావేశమది. అసెంబ్లీ వ్యూహ రచనకు ఏర్పాటు చేశారు. పిసిసి అధ్యక్షుడు శ్రీ కె. రోశయ్య కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కలిసి కట్టుగా వుండాలని; పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయాలని హితబోధ చేస్తుండినారట. అంతే - వున్నట్టుండి యానాదిరెడ్డి గారు లేచి, రోశయ్యపై విరుచుక పడ్డారట. "మేమెందుకు చేయాలి? ఐదు సంవత్సరాలు అధికారం అనుభవించి, ఎన్నికల్లో ఓడిపోయిన వారే పార్టీలో ఇంకా ఆధిపత్యం వహిస్తున్నారు; గెలిచిన మమ్మల్ని ఏమాత్రం ఖాతరు చేయడం లేదు." అంటూ మధ్య మధ్యలో బూతులు రంగరించి, అభినయం చేస్తూ, పంచెవిప్పి కట్టుకొంటూ శివమెత్తి పోయారట. ఆ స్పీడు చూసి పాపం రోశయ్య బిత్తర పోయినట్లున్నారు. "వచ్చేదిలో చెప్పరాదా, ఆ బూతుల పంచాంగ మెందుకని" వారించబోతే, యానాది బావకు మరింత సిగమెక్కిందట.

"ఇప్పుడు మేము కష్టపడి పనిచేసి పార్టీని బ్రతికించినా రేపు పార్టీ అధికారంలోకి రాగానే వారే పెత్తనం చలాయిస్తారు. అప్పుడు మా పరిస్థితి మళ్లీ మామూలే. నెల్లూరులో కాంగ్రెస్ తరపున నేను ఒక్కడినే గెల్చాను. కాని జిల్లా కాంగ్రెస్ కమిటీ నాకు గౌరవమే ఇవ్వడం లేదు. ఓడిపోయిన వారే పెత్తనం వహిస్తుంటే గెల్చిన మేము నోరు మూసుకొని పడి వుండాలా? గాంధీ భవన్‌లో కూర్చుని మామీద కర్ర పెత్తనం చేస్తే ఎట్లా? జిల్లాల్లో మా బాధలూ ఆలోచించండి. పిసిసి అధ్యక్షుడిగా మీరు సంబంధీకులను

> **డోలేంద్ర**

ఏర్చి మాట్లడ కూడదా" అన్నారట యానాది రెడ్డి గారు.

పేరు ఎత్తకపోయినా ఆయన ఉక్రోషం ఎవరి మీదో చెప్పకుండానే అర్థమై పోతున్నది. అంతే అంత పూనకంతో ఎగిరి పడే ముందు తన గురించి తాను ఒక్కసారి ఆలోచించుకొని వుంటే బాగుండేది.

కొరవ 7 పేజీలో


యూనిఫారం వస్త్రములు



అన్ని స్కూళ్ళ, కాన్వెంట్ల యూనిఫారం వస్త్రములు మిల్లు ధరలకే లభించును.

విమల్ జంక్షన్
కాపువీధి
నెల్లూరు - 1
ఫోన్ : 25420



స్త్రీల టానిక్ లోధ్ర



బాధారహిత ఆరోగ్యమును స్త్రీలకు 90 సంవత్సరములుగా ఇచ్చుచున్నది.

స్త్రీలకు కలుగు అకాలబహిష్టు, ముట్టుకుట్టు, బహుతరక్తం ఎక్కువతక్కువగాపోవుట, నడుము నొప్పి, సంతానహీనత, గర్భకాలపు జబ్బులకు

ఉచిత వైద్యసలహా కొఱకై ఈ ప్రక్కచిరునామాతో సంప్రదించండి

తయారుచేయువారు:
కేసరి కుటీరం (ప్రైవేట్) లిమిటెడ్
రాయపేట, మద్రాసు - 600 014.

ఏజంట్లు : సీతారామ జనరల్ స్టోర్సు ఏజన్సీస్, విజయవాడ - 1 - [illegible]



India's widest and largest selling frost-free range.
You're sure to find one designed just for you.
BPL



BPL FROST-FREE
Authorised Sales & Service Main Dealer
BABU ELECTRONICS
Trunk Road, Nellore 524 001, Ph: 24212

## నవ్వి పోదురుగాక నాకేటి అన్నట్లుంది వ్యవహారం!

# జిపఛైర్మన్ మరీ ఇంత సిగ్గు విడిచేశారేమిటి?

నెల్లూరు జిల్లా పరిషత్‌ను ఉపాధ్యాయు బదిలీ విక్రయ శాలగా మార్చి వేశారు – ఛైర్మన్ డాక్టర్ ఎన్. నాగభూషణమ్మ గారు. జిప బదిలీలలో చిల్లర దందకాలు సర్వ సాధారణమే; కాని అవి వెలకి కొట్టుకుని పడి జరిగిపోయేవి; ఇప్పుడు వేలం కేంద్రంగా తయారైంది పరిస్థితి!

నాగభూషణమ్మ గారు విద్యావంతురాలు; డాక్టర్‌గా ప్రభుత్వ సర్వీసులో వుండినవారు; స్థితిమంతురాలు కూడా! ఎన్టీ రామారావు గారు ఆమెకు రాజకీయ భిక్ష పెట్టారు. రెండు ఎన్నికల్లో ఓడిపోయినా దయతల్చి పిల్చి జిప ఛైర్మన్‌ను చేశారు. ఆయనే బ్రతికి వుంటే మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో ఆమె నెల్లూరు నియోజక వర్గం అభ్యర్థి అయి వుండేది. ఉజ్వలమైన రాజకీయ భవిష్యత్‌ను నిర్మించు కోవలసిన ఆమె – చిల్లర సంపాదనపై వ్యామోహంతో తన వ్యక్తిత్వాన్ని కించ పరచుకోవడమే కాకుండా, తన పదవి పరువునూ బజారు కీడుస్తున్నారు.

ఎమ్మెల్యే సిఫార్సు చీటీ వుంటే – బదిలీ రేటు 3 వేల రూపాయలు; ఏ సిఫార్సూ లేకుంటే 10 వేలు; హెచ్‌ఎమ్ ప్లేస్ అయితే ఒక ధర; స్వంత మండలం, స్వంత వూరైతే ఒక ధర; భార్యా భర్త ఒకే దగ్గరకు రావాలంటే అందుకు స్పెషల్ రేటు. పోటీ ఏర్పడిన బదిలీ విషయంలో రేటు జాస్తిగా వేల వరకు వెళ్తున్నదట. ఆమె ఇంటి ముందు గత నాలుగు రోజుల నుంచి అయ్యవార్ల రాకపోకలు తిరునాళ్ల వలె వుంటున్నాయి. సంధాన కర్త ఆమె పతి దేవుడేనట. ఆయనా – ప్రభుత్వోద్యోగే! కాని పదేళ్ల ఉద్యోగం చేస్తే వచ్చే జీతం సొమ్ము ఒకే రోజు [illegible] – వాటిని లెక్క పెట్టు కోవడానికి వూపిరాడక తకబిక పడిపోతున్నారు.

ఏమిటి దుర్మార్గం? ఇంత విచ్చలవిడిగా, విశృంఖలంగా, బరితెగింపుగా బదిలీలు విక్రయించడమేమిటి? విచిత్ర మేమిటంటే జిప సభ్యుల నుంచి ముఖ్య మంత్రి వరకు ఈ రచ్చ, రభస తెలుసు. కాని ఆమెను ఎవరూ నివారించ లేక పోతున్నారు; ఎవర్నీ ఆమె లక్ష్య పెట్టడం లేదు. ఈ మధ్య ఒక రోజు ఎమ్మెల్యే లందరూ కలసి ముఖ్య మంత్రికి ఫిర్యాదు చేస్తే – ఆయన పంచాయతీ రాజ్ మంత్రిని చూడమన్నారట. ఆయన ఎమ్మెల్యేలను, ఆమెను పిల్చి పంచాయితీ పెడితే – ఆమె అందులో ఎమ్మెల్యేలను ఏదిల్చి పారేసిందట. తర్వాత ముఖ్య మంత్రి సమక్షంలోనూ ఇదే జరిగినట్లుంది. "మీ మంత్రు లందరూ తినడం లేదా, వారిని మీరేమి చేస్తున్నారు? నెల్లూరులో రమేష్ రెడ్డికి తోడుగా ఆయన బావమరిది; దుర్గా ప్రసాద్ వెంట ఆయన బావ; ప్రసన్న కుమార్ రెడ్డికి తమ్ముడు వుండగా లేనిది, నాతో నా భర్త తిరిగితే, నా తరపున "పనులు చక్కబెడితే" తప్పు వచ్చిందా; నేను నాక్షేపం వంటి డాక్టర్ వృత్తి వదలుకొని వచ్చాను. నా జరుగుబాటేదో నేను చూసుకోవాలి కదా" అని సిగ్గు విడిచేసి మాట్లాడారట నాగభూషణమ్మ గారు.

> **మంత్రులందరూ తినడం లేదా అని నాగభూషణమ్మ ఎదురు ప్రశ్నించే సరికి ముఖ్యమంత్రి నోరు వెళ్ళబెట్టారట!**

ఆమె ప్రసంగ ధోరణికి ప్రశ్నమున్న ఎమ్మెల్యేలే కాదు – ముఖ్యమంత్రే నివ్వెర పోయినారని చెప్తున్నారు. ముఖ్యమంత్రి ఆమె చెప్పిందంతా విని పెద్దగా నవ్వి, అక్కడ్నుంచి వెళ్లిపోయారట.

ఇంకోక ప్రక్క జిప సభ్యుల పరిస్థితి అంతేగా వుంది. వారూ ఆమెతో విసిగి పోయారు. తాము వెళ్తే కనీసం పలకరించడం కూడా లేదని; తాము బదిలీలకు సిఫార్సు చేసినా, తమనే పైకం అడుగు తున్నారని; వాదనకు దిగితే దులపరించి పారేస్తున్నారని జిప సభ్యులు వాపోతున్నారు. తమ బాధ ముఖ్యమంత్రికి చెప్పుకోవ డానికి తెలుగు దేశం జిప సభ్యులందరూ కలసి ఒక స్పెషల్ బస్‌లో హైదరాబాదు వెళ్లారు. పార్టీ ఆదేశాలు ధిక్కరించి అయినా సరే – ఆమెపై అవిశ్వాస తీర్మానం పెట్టి దించి వేయాలన్నది వారి పంతం. కానీ అవిశ్వాస తీర్మానం పెట్టడానికి ఇంకా ఆరు నెలల వ్యవధి వుందట.

ఛైర్మన్ గారి ధోరణికి విసిగి పోయిన జిప కార్యనిర్వహణాధికారి, ఆమె చేసిన బదిలీ ఫైళ్లను తొక్కి పెట్టేయడంతో అయ్యవార్లు గగ్గోలు పెడుతున్నారు. పదివేలు, పదిహేను వేలు ఇచ్చి ఛైర్మన్ చేత సంతకం చేయించుకొన్నా, సి.ఇ.ఓ. ఆర్డర్లు ఇవ్వడం లేదు. మరీ ఇంత బరితెగించి, ఆఫీసులోనే రేట్లు పెట్టి దండి. తనను

> *ఎమ్మెల్యే సిఫార్సు చీటీ తెస్తే 3 వేలు; లేకుంటే పదివేలు! టీచర్ల బదిలీలకు వేలం పాట పెట్టి విక్రయిస్తున్నారు!*

ఉత్తర్వు లిమ్మంటే తానెట్లా ఇచ్చేదని ఆయన ఆవేదన అట. రేపు విచారణ ఏదైనా వస్తే తాను ఇరుక్కొంటానని ఆయన భయపడు తున్నారు.

చాలా అసహ్యంగా, జుగుప్సాకరంగా వుంది పరిస్థితి. నాగభూషణమ్మ గారు అంత విద్యావంతురాలై వుండి, ఇంత నిస్సిగ్గుగా లంచాలకు కక్కుర్తి పడడం భరింప శక్యం కాని విషయం. ముఖ్య మంత్రి ఇప్పటికైనా ఆమె చేసిన బదిలీలన్నీ రద్దు చేసి, విచారణ జరిపించి, తప్పు రుజువైతే ఆమెను ఆ పదవి నుంచి తప్పించడం ఆయన పార్టీ పరువు దృష్ట్యా చూసినా చాలా శ్రేయస్కరం.


మా ఇంటిదివ్యజ్యోతి - మా ఆత్మబంధువు
పేద ప్రజల జీవనజ్యోతి
ఈనాటి మా అభివృద్ధికి కారకుడు

## కె.వి.ఆర్
## (కలవకూరు వెంకటరెడ్డిగారు)

**21వ వర్ధంతి (20.7.96)** తేది
సందర్భంగా వారి పవిత్రాత్మకు
శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

కె.వి.ఆర్. బ్రదర్స్ అండ్ సన్స్




Edited, Printed and Published by N. Dolendra Prasad at Zaminryot Press. Offset Printing at Nayagara Paper Products (India) Limited, Nellore